క్లుప్తంగా

పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించండి

- అధికారులకు ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశం

కరప: ఉపరితల ఆవర్తన ప్రభావంతో మూడు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో వ్యవసాయ, రెవెన్యూశాఖ అధికారులు గ్రామాల్లో పర్యటించి, పంటపొలాలను, ధాన్యం రాశులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం జేడీఏ ఎన్.విజయ్‌కుమార్, ఏడీఏ కె.బాబూరావు, ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు తదితర అధికారులతో ఆయన సమావేశమై సమీక్షించి పలు సూచనలు ఇచ్చారు. కోతకు సిద్ధమైన పంటపొలాలు ఏ పరిస్థితిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ధాన్యం మొలకలు రాకుండా తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. కళ్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కన్నబాబు ఆదేశించారు. మొలకెత్తిన ధాన్యాన్ని పరిశీలించాలని, ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాక గణనకు తీసుకోనున్నట్టు తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని, రైతు పండించిన ధాన్యాన్ని సకాలంలో మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అన్నిరకాల చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



వేళంగిలో ధాన్యం రాశులు విడదీయించి ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయిస్తున్న అధికారులు

కరప: మండల పరిధిలో రైతులు అప్రమత్తమై ధాన్యం మొలకెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎంఏఓ ఏవీ రాజేష్, తహసీల్దార్ పి.శ్రీనివాసరావు సూచించారు. ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ఆదేశాల మేరకు బుధవారం మండల వ్యవసాయ, రెవెన్యూ అధికారులు కరప, వేములవాడ, వేళంగి, కూరాడ తదితర గ్రామాల్లో పర్యటించి, పంట పొలాలను, కళ్లాల్లోని ధాన్యం రాశులను పరిశీలించి, రైతులకు సూచనలిచ్చారు. పొలాల్లో నీరు నిలబడితే పిల్ల కాలువలు ఏర్పాటు చేసి వర్షంనీరు పోయేలా చేయాలని, కోసిన చేలు పనల మీద ఉన్నా, ధాన్యం రాశులు తడిసిపోయినా 5 శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని ఎంఏఓ రాజేష్ సూచించారు.

నిజమైన హిందూ దళితులకు బీజేపీ అండ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నిజమైన హిందూ దళితులకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని ఆ పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు గుడిసె దేవానంద్ అన్నారు. కాకినాడ హెలికాన్ టైమ్స్‌లో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. దళితుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం వేలాది కోట్లు మంజూరు చేస్తోందన్నారు. కాంగ్రెస్‌తో పాటు మరికొన్ని పార్టీలు బీజేపీ దళితులకు వ్యతిరేకమని తప్పుడు ప్రచారం చేస్తున్నాయన్నారు. దళితులకు బీజేపీ ఏమీ చేసేందో తెలియజేసేందుకు పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. సమావేశంలో బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్, బీజేపీ నాయకులు ముత్తా నవీన్, మాలకొండయ్య, గట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



ఎంపీడీఓల శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

సామర్లకోట: శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈటీసీ మేనేజరు పి. శ్రీనివాసరావు ఎంపీడీఓలకు సూచించారు. స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో ఎంపీడీఓలకు బుధవారం ఆయన ఒక రోజు శిక్షణ ఇచ్చారు. పంచాయతీ రాజ్ అండ్ రూరల్ డవలప్‌మెంట్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని బాపట్ల, సామర్లకోట, శ్రీకాళహస్తి ఈటీసీలలో శిక్షణలు ఇస్తున్నట్టు తెలిపారు. తరగతి గదిలో నేర్చుకున్న అంశాలపై ఫీల్డు విజిట్ ఉంటుందన్నారు. బుధవారం శిక్షణలో ఫ్యాకల్టీలు వెంకటేశ్వరరావు, ఎస్‌కే మొహిద్దీన్, నిహారిక శిక్షణ ఇచ్చారు.

రైతులు ఆందోళన చెందవద్దు

తాళ్లరేవు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులు, మిల్లర్లతో తహసీల్దార్ పోతురాజు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతంగా జరుగుతున్నాయని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు. పలుచోట్ల అడ్డుకట్టలతో పంట పొలాల్లో నీరు దిగక రైతుల ఇబ్బందులు తమ దృష్టికి వచ్చాయని, ఉపాధి పథకంలో వాటిని తొలగించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ధాన్యం కొనుగోలు కోసం మండలానికి 5 ట్రాక్టర్లు అదనంగా కేటాయించారని, వాటిని రైతులు ఉపయోగించుకోవాలన్నారు. గోనె సంచుల కొరత లేదని, ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈఓపీఆర్డీ మల్లాడి భైరవమూర్తి, సూపరింటెండెంట్ మోహనకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

యంత్రమే మంత్రం

- అధికారులు స్పందించాల్సి సమయం
- అన్నదాత కష్టాలకు తరుణోపాయం
- ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న వైనం

కరప: సాంకేతిక పరిజ్ఞానం రోజు, రోజుకూ అభివృద్ధి చెందుతున్నా అన్నదాతకు మాత్రం అల్లంత దూరంలో ఉండిపోయింది. అమెరికా, చైనా, థాయిలాండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియా వంటి ఇతర దేశాలలో విత్తనాలు చల్లడం దగ్గర నుంచి పంట చేతికి వచ్చే వరకు యంత్రాలతోనే సాగు చేస్తుంటారు. మన దేశంలో నేటికీ అక్కడక్కడా కాడి, ఎద్దులు దర్శనమిస్తూనే ఉన్నాయి. ప్రకృతి శక్తులు మీద పడి కుమ్మేసినా కనీసం కిక్కురుమనలేని స్థితిలో అన్నదాత ఉన్నాడు. ట్రాక్టర్లు, పవర్ టిల్లర్లు, డమ్‌సీడర్లు, వరికోత యంత్రాలు, హార్వెస్టర్లు మనకీ అందుబాటులోకి వచ్చినా బడుగు రైతుకు మాత్రం చేరడం లేదు. సస్యంపై వరుణుడు దాడిచేస్తే తట్టుకుని నిలబడడానికి ఎన్నో కొత్త వంగడాలను శాస్త్రవేత్తలు సృష్టించినా అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో సంప్రదాయ సన్నాలు, బొండాలు, స్వర్ణ తదితర రకాలనే రైతులు పండిస్తున్నారు. అలాగే వర్షార్పణమైన ధాన్యాన్ని ఆరబెట్టి తేమను ఆవిరిచేసే హార్వెస్టర్లను ప్రభుత్వాలు మంజూరు చేస్తున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా కనపడవు. రోడ్డుపైన ఆరబెట్టుకోవడమే పల్లెల్లో కనిపిస్తుంటుంది. మరి ఆ యంత్రాలు ఏమయ్యాయంటే ఎవరూ సమాధానం చెప్పరు. హార్వెస్టర్లు వచ్చాక వరిచేలో గడ్డి వేరుపడి, ధాన్యం వడ్డుకు తీసుకొస్తారు, తేమశాతం పోయేలా నాలుగైదు రోజులు ఎండపెట్టాలి. అదే డ్రయ్యర్ ఉంటే అందులో ధాన్యం వేస్తే తేమశాతం పోయి ధాన్యం వస్తాయి. అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ధాన్యం రాశులు తడిసి రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది నేడు. తేమ ఎక్కువ శాతం ఉందన్న నెపంతో 75 కిలోల బస్తాకు నాలుగైదు కిలోలు కోత విధించడం వల్ల మద్దతు ధర అందకుండా పోతోంది.



వలసపాకలలో బరకాలతో కప్పిన ధాన్యపు రాశులు



వేములవాడలో మూలనపడ్డ డ్రయ్యర్



పెనుగుదురులో ధాన్యం ఆరబెట్టుకుంటున్న అన్నదాత

నిర్వహణ వ్యయం భరించలేక..



వేములవాడ పీఏసీఎస్ ద్వారా 2014–15లో డ్రయ్యర్‌ను కొనుగోలు చేశారు. దీని ఖరీదు రూ.16 లక్షలైతే రూ.12 లక్షలు రాయితీ, మిగిలిన రూ.4 లక్షలు సొసైటీ చెల్లించాలి. అది మరమ్మతులకు రావడంతో మూలనపడింది. హర్యానా నుంచి మెకానిక్ వచ్చి బాగుచేయాలి. పీఏసీఎస్ చెల్లించాల్సిన సొమ్ము చెల్లించలేదు. దాని నిర్వహణ ఖర్చు భరించలేక వినియోగించడం లేదు. అది వినియోగంలోకి వస్తే గంటకు 8 బస్తాలు తేమ లేకుండా వస్తాయి. – శ్రీను, సీఈఓ

నాలుగు హార్వెస్టర్లే ఉన్నాయి



మండల పరిధిలోని 12 ఆర్‌బీకేలలో ప్రస్తుతం నాలుగు హార్వెస్టర్లు, ఒక పాడీ వీడర్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి గ్రామంలో రెండు మూడు హార్వెస్టర్లు అద్దెకు ఉన్నాయి. టార్పాలిన్లు ప్రస్తుతం వ్యవసాయశాఖ ద్వారా ఇవ్వడంలేదు. జూన్ నెలలో ఇచ్చే ప్రతిపాదనలున్నాయి. – ఏవీ రాజేష్, ఎంఏఓ, కరప

డ్రయ్యర్లు ఉంటే మంచిది



కోతల వేళ, దిగుబడి వేళ అకాల వర్షాలు కురిస్తే ధాన్యం రాశులు తడిసిపోతాయి. వర్షం రాకపోయినా వరికోత, నూర్పిడి యంత్రంతో కోయిస్తుండటం వల్ల ధాన్యం ఆరబెట్టాల్సి వస్తోంది. డ్రయ్యర్ ఉంటే వాతావరణం ఎలా ఉన్నా ధాన్యాన్ని అందులో పోస్తే తేమ లేకుండా ధాన్యం వస్తాయి. టార్పాలిన్లు కూడా ప్రభుత్వం సరఫరా చేస్తే పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవచ్చు. – రెడ్డి వీరభద్రరావు, రైతు, కరప

దివంగత హోంగార్డుల కుటుంబాలకు ఆర్థిక సాయం



విశ్రాంత హోంగార్డుకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో ఉండి మరణించిన హోంగార్డులు గోవిందరాజు, గోవిందు కుటుంబాలకు అందిన ఆర్థిక భరోసాను ఎస్పీ సతీష్‌కుమార్ వారి కుటుంబాలకు అందజేశారు. గోవిందరాజు మరణంతో అందిన బీమా మొత్తం, గోవిందు మరణం నేపథ్యంలో జిల్లా హోంగార్డులు అందించిన ఒక రోజు వేతనం మొత్తాన్ని ఎస్పీ ఈ సందర్భంగా సమకూర్చారు. అనంతరం ఇటీవల పదవీ విరమణ పొందిన హోంగార్డు సీడీడీ ప్రసాద్‌కు జిల్లా హోంగార్డులు సమకూర్చిన ఒక రోజు వేతనం మొత్తాన్ని అందించారు.

హడలెత్తించిన పొడ పాము



తాళ్లరేవు: పి.మల్లవరం పంచాయతీ రాంజీనగర్ వద్ద బుధవారం భారీ పొడ పాము హడలెత్తించింది. అక్కడ పంట కాలువలో కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో నాలుగు అడుగుల పొడపామును కూలీలు గుర్తించారు. దానిని కూలీలు హతమార్చడంతో ప్రమాదం తప్పిందని వార్డు సభ్యుడు కె.వెంకటేశ్వరరావు తెలిపారు.

వైభవంగా విగ్రహాల పునఃప్రతిష్ఠ

- పాల్గొన్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు
- జనసంద్రంగా మారిన నడకుదురు



శివలింగానికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు దంపతులు, నాయకులు

కరప: మండలం నడకుదురులో పునర్నిర్మించిన శివాలయంలో బుధవారం బాలాత్రిపురసుందరి సమేత రామలింగేశ్వరస్వామి విగ్రహాల ప్రతిష్ఠ భక్తి, శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. పురాతనమైన శివాలయం జీర్ణోద్ధరణదశకు చేరుకోవడంతో గ్రామస్తుల వినతిమేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు రూ.కోటి మంజూరు చేయగా గతేడాది భూమిపూజ చేశారు. ఇందులో గ్రామస్తులు రూ.33.3 లక్షలు చెల్లించారు. ఆలయ కమిటీ, దేవదాయశాఖ పర్యవేక్షణలో ఆలయాన్ని పునర్నిర్మించారు. ఐదు రోజులుగా శ్రీవిద్యాపూర్ణ దీక్షాపరులు, బ్రహ్మశ్రీ యేలూరిపాటి ప్రభాకరశర్మ ఆధ్వర్యంలో పూజాదికాలు నిర్వహించి, విగ్రహప్రతిష్ఠ నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నబాబు, శ్రీవిద్య దంపతులు స్థానిక నాయకులతో కలసి పూజలుచేసి, ఆలయనిర్మాణ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కన్నబాబు దంపతులను ఆలయకమిటీ చైర్మన్ ముమ్మిడి రత్నకుమార్, దేవదాయశాఖ ఈఓ మోర్త మురళీవీరభద్రరావు గ్రామస్తులతో కలిసి ఘనంగా సత్కరించారు. 12 వేల మంది భక్తులు తరలివచ్చి, స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. రాష్ట్రబాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు టి.ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు ముమ్మిడి సూరిబాబు, పైలా రామతులసి, గోవిందు, సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, సత్తిబాబు, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, చక్రవేణి దంపతులు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు జవ్వాది సతీష్, ఇన్‌చార్జి కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

సమగ్రంగా రీ సర్వే చేయండి

- జూన్ 30 నాటికి పూర్తి కావాలి
- కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్



రీ సర్వే ప్రగతిపై అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్

కాకినాడ: జగనన్న శాశ్వత భూహక్కు–భూ రక్ష పథకంలో భాగంగా చేపట్టిన అర్బన్ రీ సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ డాక్టర్ మహేష్ కుమార్ రావిరాల ఆదేశించారు. రీ సర్వే ప్రగతిపై బుధవారం టౌన్ ప్లానింగ్ అధికారులు, టీపీఎస్‌లు, సూపర్‌వైజరీ అధికారులతో కమిషనర్ బుధవారం కార్యాలయంలో సమీక్షించారు. ఇప్పటి వరకూ జరిగిన ప్రగతిని పవర్‌పాయింట్ ద్వారా వివరించారు. కమిషనర్ మాట్లాడుతూ కార్పొరేషన్ పరిధిలో దాదాపు తొమ్మిది వేల సర్వే నంబర్లలో ఉన్న 84 వేల అసెస్మెంట్ నెంబర్లను అనుసంధానం చేసే ప్రక్రియ స్పష్టమైన సమాచారంతో ఉండాలన్నారు. ఈ మొత్తం ప్రక్రియను జూన్ 30వ తేదీ నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ క్రమంలో ఎదురయ్యే సాంకేతిక సమస్యలను సంబంధిత అధికారులతో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. దీనివల్ల ఎన్నో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ప్రజలు కూడా రీ సర్వేకు సహకరించాలని కమిషనర్ కోరారు. నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాసు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు, సూపర్వైజరీ అధికారులు పాల్గొన్నారు.

కబ్జాలపై విచారణ జరపాలి



తూరంగి పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న తూరంగి ప్రజలు

కాకినాడ సిటీ: కాకినాడ రూరల్ మండలం తూరంగిలోని ప్రభుత్వ ఖాళీ స్థలాలు, సామాజిక స్థలాలు కబ్జాలకు పాల్పడుతూ వాటిని యథేచ్ఛగా వ్యాపారాలు చేస్తున్నారని తూరంగి ప్రజలు బుధవారం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తూరంగిలో ప్రభుత్వ భూములు కబ్జాలకు గురౌతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రభుత్వ భూములను కాపాడాలంటూ వందల సార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా సమస్యను పట్టించుకోలేదని ప్రజలు ఆరోపించారు. తూరంగి దందాలపై సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ సామాజిక స్థలాలను రక్షించాలని సీపీఎం నాయకులు చింతపల్లి అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. సర్వేనంబర్ 217/26లో గల పార్కు స్థలాన్ని కాలనీలో అభివృద్ధి చేయాలని కోరుతున్నామన్నారు. అధికారులు ఈ స్థలాన్ని సర్వే చేసి ఫెన్సింగ్ వేయాలని, పార్కు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే తూరంగి ప్రభుత్వ భూముల పరిరక్షణకు, సామాజిక స్థలాల రక్షణకు కలెక్టర్ జోక్యం చేసుకుని సమగ్ర విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిబిరం

సామర్లకోట: మాధవపట్నం శివారు జమునా నగర్‌లో బాలమందిరం, జనవిజ్ఞాన వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిబిరం బుధవారం సాయంత్రం ఉత్సాహంగా కొనసాగింది. జీవన నైపుణ్యాలు అనే అంశంపై చిన్నారులకు అవగాహన తరగతులు నిర్వహించారు. బాలమందిరం కన్వీనర్ అంగర గోపాలకృష్ణ అధ్యక్షతన తోలు బొమ్మలాట నిర్వహించారు. సృజనాత్మక ఆలోచన నైపుణ్యాలపై అద్దేపల్లి ఉదయభాస్కర్ చిన్నారులకు వివరించారు. సమస్యా పరిష్కార నైపుణ్యాలపై దీక్షితుల సుబ్రహ్మణ్యం చక్కని కథలు ఆధారంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. శిబిరంలో చిన్నారులకు సృజనాత్మకమైన, శాస్త్రీయమైన ఆలోచన కలిగి ఉంటూ విజయాలు సాధించాలని అంగర గోపాలకృష్ణ అన్నారు.

అలరించిన నృత్యప్రదర్శన



రత్నగిరిపై కూచిపూడి నృత్యప్రదర్శన ఇస్తున్న హైదరాబాద్ కళాకారులు

అన్నవరం: సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా రత్నగిరి కల్యాణ వేదిక మీద బుధవారం రాత్రి హైదరాబాద్ కళాకారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు అలేఖ్య, మనస్విని, కీర్తన, హేమ లలిత, దేవి సుహాసిని, వివిధ భక్తి గీతాలకు అద్భుతంగా నృత్యం చేశారు. కళాకారులు, వారి గురువు ఎ.సంజీవబాబులను దేవస్థానం అధికారులు సత్యదేవుని చిత్రపటాలు, స్వామివారి ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

ఆర్టీసీ డ్రైవర్ నిజాయితీ

- దొరికిన బంగారు గొలుసు అప్పగింత



అధికారుల సమక్షంలో ప్రయాణికురాలికి బంగారు గొలుసు అప్పగిస్తున్న సిబ్బంది

కాకినాడ: ఓ ప్రయాణికురాలు బస్సులో జారుకున్న బంగారు గొలుసును విధుల్లో డ్రైవర్ యజమానికి అప్పగించి నిజాయితీని చాటుకున్నారు. బుధవారం అమలాపురం వెళ్లే బస్సు ఎక్కిన ప్రయాణికురాలు పి.విజయలక్ష్మి యానాంలో దిగిపోయారు. ఈ క్రమంలో తన మూడు కాసుల గొలుసు జారిపోయిందని గ్రహించి కాకినాడ డిపోలోని అధికారులకు ఆమె ఫిర్యాదు చేశారు. ఆ బస్సులో విధుల్లో ఉన్న డ్రైవర్ వీకేకే బాబుకు ఆ బంగారు గొలుసు దొరికింది. దానిని భద్రపరిచి డిపోకు తీసుకొచ్చి భద్రంగా విజయలక్ష్మికి అప్పగించారు. పోగొట్టుకున్న ప్రయాణికురాలి వివరాలను డిపో అధికారుల ద్వారా సేకరించి సరిచేసుకున్న తరువాత ఆర్టీసీ సెక్యూరిటీ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ద్వారా గొలుసు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఏవో మూర్తి, డీసీ ధర్మారావు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



మెయిన్‌రోడ్డులో ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

కాకినాడ సిటీ: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, ఆ పరిశ్రమకు సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కాకినాడ మెయిన్‌రోడ్డులోని హెడ్ పోస్టాఫీసు వద్ద బుధవారం ధర్నా నిర్వహించారు. మూడు లక్షల కోట్ల విలువైన ఉక్కు పరిశ్రమను బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్లకు రూ.9 వేల కోట్లకు విక్రయించే ప్రయత్నాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. బలిదానాలతో, 62 మంది ఎంపీల రాజీనామాలతో, 30 గ్రామాల ప్రజల భూముల త్యాగంతో ఉక్కును సాధించుకున్నామన్నారు. 30 వేల మంది ప్రత్యక్షంగా, లక్ష మందికి పరోక్షంగా ఉపాధి కల్పించే నవరత్న హోదా కలిగిన విశాఖ ఉక్కుని ఎట్టి పరిస్థితుల్లో ప్రైవేటీకరణ కానివ్వబోమని ప్రతినబూనారు. కేంద్ర కార్మిక సంఘాల ప్రతినిధులు దువ్వా శేషుబాబ్జీ, తోకల ప్రసాద్, గదుల సాయిబాబు, జె.వెంకటేశ్వర్లు, చెక్కల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇటుకల కొరత రానీయొద్దు



గృహనిర్మాణ ప్రగతిని సమీక్షిస్తున్న అదనపు కమిషనర్ నాగనరసింహారావు

- జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి
- సమీక్షలో ఏడీసీ నాగనరసింహారావు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకంలో గృహ నిర్మాణాలకు ఇటుకల కొరత లేకుండా డిమాండ్‌కు తగిన సరఫరా ఉండేలా కాంట్రాక్టర్లు శ్రద్ధ చూపాలనిని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సూచించారు. బుధవారం కొమరగిరి, పండూరు, ఏపీ త్రయం లేఅవుట్లలో గృహనిర్మాణ ప్రగతిపై హౌసింగ్, మెప్మా, నగరపాలక సంస్థ, ప్రత్యేకాధికారులతో స్థానిక కార్యాలయంలో సమీక్షించారు. కొమరగిరి లే అవుట్‌లోనే సుమారు 5500 గృహాలు గ్రౌండ్ అయ్యి వివిధ దశల్లో ఉన్నాయన్నారు. అక్కడ నిర్మాణాలకు అవసరమైన ఇటుకల సరఫరాలో కొరత కనిపిస్తోందని కాంట్రాక్టర్ సొంతంగా ఇటుకల బట్టీ పరిశ్రమను సమకూర్చుకోవాలని, ఇందుకు లే అవుట్ ప్రాంగణంలో అవసరమైన సహకారాన్ని అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కార్యదర్శి ఎం.ఏసుబాబు, హౌసింగ్ ఈఈ గుప్త, డీఈ సత్యనారాయణరెడ్డి, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, సిటీ మిషన్ మేనేజర్ వెంకటరాజు, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్తను సేకరించాలి

కాకినాడ సిటీ: ప్రతి ఇంటి నుంచి తప్పనిసరిగా చెత్తను సేకరించేలా చూసే బాధ్యత పారిశుధ్య కార్యదర్శులదేనని ఏడీసీ సీహెచ్ నాగనరసింహారావు స్పష్టం చేశారు. బుధవారం ఆయన 33వ డివిజన్ లచ్చిరాజువారి వీధి, మార్కెట్ ప్రాంతాలలో పారిశుధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. బహుళ అంతస్తుల భవనాల్లోని పై అంతస్తుల్లోని వారి నుంచి కూడా చెత్త సేకరించేలా చూడాలని సిబ్బంది ఆదేశించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేంద్రప్రసాద్, సచివాలయ కార్యదర్శులు ఆయన వెంట ఉన్నారు.

సామూహిక అత్యాచారం అవాస్తవం

డీఎస్పీ మురళీమోహన్



తుని రూరల్ పోలీస్ స్టేషన్‌లో విలేకర్లతో మాట్లాడుతున్న దిశ డీఎస్పీ మురళీమోహన్

తుని రూరల్: కోటనందూరు బస్టాండు సమీప మార్కెట్ షెడ్డులో గుర్తు తెలియని యువతిపై సామూహిక అత్యాచారం అవాస్తవమని దిశా డీఎస్పీ సుంకర మురళీమోహన్ తెలిపారు. బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో తప్పుడు వార్త ప్రచురించడం, సోషల్ మీడియాలో వైరల్ చేయడాన్ని ఆయన ఖండించారు. రూరల్ సీఐ సన్యాసిరావు, కోటనందూరు, తుని రూరల్ ఎస్సైలతో కలసి డీఎస్పీ మురళీమోహన్ తుని రూరల్ పోలీస్ స్టేషన్లో విలేకర్లతో మాట్లాడారు. పత్రికలో ప్రచురించినట్టు, పెనుముచ్చు ప్రవీణ్ కుమార్ సోషల్ మీడియాలో వైరల్ చేసినట్టు యువతిపై అత్యాచారం జరగలేదని తమ విచారణలో స్పష్టమయ్యిందన్నారు. మార్కెట్ షెడ్డులో పడుకుని ఉన్న మహిళ మద్యం తాగి ఉందన్నారు. తనకు వివాహమైందని, భర్త చనిపోయి 12 సంవత్సరాలు అయ్యిందని ఆ మహిళ తెలిపిందన్నారు. 15 ఏళ్ల వయస్సు గల కుమార్తె ఉందని, ఆమెను చూడడానికి కోటనందూరుకు ఆర్టీసీ బస్‌లో వెళుతూ గత నెల 27న మద్యం మత్తులో మార్కెట్ షెడ్డులో పడుకున్నట్టు ఆమె చెప్పిందన్నారు. ఈ క్రమంలో పడుకున్న మహిళ దుస్తులు చెదిరిపోవడంతో స్థానికుల్లో ఒకరు సర్దినట్టు తెలిసిందన్నారు. తనపై ఎవరూ అత్యాచారం చేయలేదని, తన మాన మర్యాదలకు భంగం కలిగించి అప్రతిష్టపాలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని బాధితురాలు కోరిందన్నారు. దీనిపై కోటనందూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్టు డీఎస్పీ వివరించారు. తప్పుడు ప్రచారం చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తుని రూరల్, కోటనందూరు ఎస్సైలు ఎ.బాలాజీ, స్వామినాయుడు పాల్గొన్నారు.